ఏడో వసంతంలోకి గ్రీన్ ఇండియా చాలెంజ్

- 3 మొక్కలతో మొదలైన మహా ఉద్యమం
- తెలంగాణకు హరితహారమే స్ఫూర్తి
- మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ తలపెట్టిన మహాకార్యం
- ఇప్పటిదాకా నాటిన మొక్కలు 265 కోట్లు
- గిన్నిస్, లిమ్కా బుక్ రికార్డ్స్
- భువనేశ్వర్‌లో ప్రారంభమైన ఏడో విడత వేడుక

భువనేశ్వర్‌లోని ఐఆర్‌సీ గ్రామంలో ఆదివారం ప్రభుత్వ పాఠశాలలో మొక్క నాటి గ్రీన్ ఇండియా చాలెంజ్ ఏడో విడతను ప్రారంభిస్తున్న స్పీకర్ సురమా పాధి, సంతోష్‌కుమార్

సోమవారం ఖుర్దా జిల్లా పరిధి కైపాదర్‌లోని శ్రీజగనాన్నథ్ కాలేజీలో మొక్కలతో సంతోష్‌కుమార్, ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): ఇంతింతై వటుడింతై అన్నట్టు.. మూడు మొక్కలతో మొదలైన 'గ్రీన్ ఇండియా చాలెంజ్' (జీఐసీ) కార్యక్రమం ఇప్పుడు మహోద్యమంగా మారింది. బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు ప్రారంభించిన 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమ స్ఫూర్తితో రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌కుమార్ 'గ్రీన్ ఇండియా చాలెంజ్'ను ప్రారంభించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బర్త్ డే సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్ చాలెంజ్ కింద రిజర్వు ఫారెస్ట్‌లను దత్తత తీసుకున్న మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ అటవీ ప్రాంతాన్ని సంరక్షించాలని గ్రీన్ ఇండియా చాలెంజ్‌కు శ్రీకారం చుట్టారు. 2018 జూన్ 17న మొదలైన ఈ మహత్తర కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు 265 కోట్ల మొక్కలను నాటారు. ఈ మహాయజ్ఞంలో సామాన్యులతోపాటు అనేక మంది సెలబ్రిటీలు పాల్గొని మొక్కలు నాటారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ ప్రోగ్రాం 'లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకున్నది. దేశంలో తలపెట్టిన మంచి కార్యక్రమాల్లో భాగంగా గ్రీన్ ఇండియా చాలెంజ్‌పై ఇండియా టుడే ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని ఐఆర్‌సీ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ సురమా పాధి మొక్క నాటి గ్రీన్ ఇండియా చాలెంజ్ ఏడో విడత కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. 'హర హైతో భారా హై- గ్రీన్ ఇండియా చాలెంజ్' (భూమి పచ్చగా ఉంటే లోకం నిండుగా ఉంటుంది) అనే నినాదంతో మొక్కలు నాటడానికి శ్రీకారం చుట్టారు. రెండోరోజు సోమవారం ఖుర్దా జిల్లా పరిధిలోని కైపాదర్‌లోని జగన్నాథ్ కాలేజీలో కళాశాల విద్యార్థులు 1500కుపైగా పండ్ల మొక్కలను నాటారు. 2030 నాటికి ఒడిశాలో కోటి చెట్లను పెంచడమే లక్ష్యం. ఇగ్నయిటింగ్ మైండ్స్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రేరణ ఇంటర్నేషనల్ అండ్ అయలిటిక్ ట్రస్ట్ సహకారం అందించాయి. కార్యక్రమంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌కుమార్, ఇగ్నయిటింగ్‌మైండ్స్ సహ వ్యవస్థాపకులు ఎం కరుణాకర్‌రెడ్డి, ఇగ్నైటింగ్ మైండ్స్ ఒడిశా నాయకుడు, ప్రొఫెసర్ ప్రఫుల్ల ధల్, ట్రీమ్యాన్ ఆఫ్ ఒడిశా, గ్రీన్ ఆర్మీ ప్రెసిడెంట్ డాక్టర్ దిలీప్ శ్రీచందన్, రాఘవ సంజీవుల తదితరులు పాల్గొన్నారు.

జీఐసీలోని కీలకాంశాలు

- గ్రీన్ ఇండియా చాలెంజ్ ప్రేరణతో బాహుబలి స్టార్ ప్రభాస్ మెదక్ జిల్లాలోని ఓఆర్ఆర్ సమీపంలోని 1,650 ఎకరాల కాజీపల్లి రిజర్వు ఫారెస్టును 2020 సెప్టెంబరులో దత్తత తీసుకున్నారు.
- హెటిరో ఫార్మా మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని ముంబాపూర్-నల్లవెల్లి రిజర్వు ఫారెస్టు సుమారు 2,543 ఎకరాలను 2020 అక్టోబర్ 5న దత్తత తీసుకున్నది. ఇందుకోసం రూ.5 కోట్లు విరాళంగా ఇచ్చారు.
- 2021జూలై 4న ఆదిలాబాద్‌లో అప్పటి ఎమ్మెల్యే జోగు రామన్న గంటలో 10 లక్ష మొక్కలు నాటారు.
- మహబూబ్‌నగర్ జిల్లా అంగన్‌వాడీ, మెప్మా, స్వయసహాయక సంఘాల మహిళలు 10 రోజుల్లో 2.08 కోట్ల విత్తన బంతులను సిద్ధం చేశారు. దేశంలోనే అతి పెద్దదైన కేసీఆర్ అర్బన్ ఎకో పార్క్ (2,097 ఎకరాలు)లో డ్రోన్ల సాయంతో వాటిని నాటారు. ఇది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సాధించింది.
- 2021 జూలై4న జీఐసీలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలోని దుర్గానగర్‌లో ఒక గంటలో 16,900 మంది 3,54,900 మొక్కలు నాటారు. ఇది లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నది.
- 2021 జూలై 24న కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా జీఐసీ ముక్కోటి వృక్షార్చన తలపెట్టింది. తెలంగాణవ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యంతో 3.30 కోట్ల మొక్కలు నాటించింది.
- 2021 జూలై 27న జీఐసీలో భాగంగా బిగ్ బీ అమితాబ్ బచ్చన్ రామోజీ ఫిలిం సిటీలో మొక్క నాటారు.
- 2022 ఫిబ్రవరి 9న ఢిల్లీ కరోల్‌బాగ్‌లోని నరైన్ ఇండస్ట్రియల్ ఏరియాలో లక్ష మొక్కలు నాటేందుకు ప్రత్యేక డ్రైవ్‌ను జీఐసీ ప్రారంభించింది.
- 2022 ఫిబ్రవరి 17న అప్పటి సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున తన తండ్రి నాగేశ్వర్‌రావు జ్ఞాపకార్థం హైదరాబాద్ ఉప్పల్ సమీపంలోని చెంగిచెర్ల ఫారెస్ట్ బ్లాక్ (1,100 ఎకరాలు)ను అభివృద్ధి చేయడానికి దత్తత తీసుకున్నారు.
- 2022 జూన్ 16న సద్గురు జగ్గీ వాసుదేశ్ శంషాబాద్‌లో మొక్కనాటి జీఐసీ ఐదో విడతను ప్రారంభించారు.
- 2023 ఫిబ్రవరి 17న కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా జగిత్యాల జిల్లా కొండగట్టు ప్రాంతంలోని వెయ్యి ఎకరాలకుపైగా అటవీ భూమిని జీఐసీలో భాగంగా సంతోష్‌కుమార్ దత్తత తీసుకున్నారు.
- 2023 మార్చి 8న ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పిల్లలపై చూపిన అదే ప్రేమతో గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో పాల్గొని మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించాలని మహిళాలోకానికి సంతోష్‌కుమార్ విజ్ఞప్తిచేశారు.
- గ్రీన్ రిబ్బన్ చాంపియన్ అవార్డును గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త సంతోష్‌కుమార్ పొందారు.
- అమీర్‌ఖాన్, సంజయ్‌దత్, సల్మాన్‌ఖాన్, అజయ్‌దేవగణ్, కంగనారనౌత్, ఆర్ఆర్ఆర్ బృందం సభ్యులు కూడా జీఐసీలో పాల్గొని మొక్కలు నాటారు.

గ్రీన్ చాలెంజ్‌లో ఎలా పాల్గొనాలంటే..

మీ ఇల్లు, పార్క్, బాల్కనీ లేదా మరేదైనా ప్రదేశంలో మూడు మొక్కలు నాటాలి. వాటితో సెల్ఫీ తీసుకొని ఆ ఫొటోలను 9000365000కు వాట్సాప్ చేయాలి. ఫొటోలను పంపిన వెంటనే మీకు యాప్ డౌన్‌లోడ్ చేసుకోమని ఒక మెసేజ్ వస్తుంది. దానిని మీరు డౌన్ చేసుకొని మీ సెల్ఫీలను అప్‌లోడ్ చేయాలి. అంతే..! ఆ ఫొటోలను గ్రీన్ ఇండియా చాలెంజ్ అధికారిక సోషల్ మీడియా పేజీల్లో పోస్టు చేస్తారు. ఇంకెందుకు ఆలస్యం.. రాబోయే తరాల కోసం ఇప్పుడే మొక్కలు నాటండి. వాటిని సంరక్షించండి. దీంతోపాటు మీ స్నేహితులు, బంధువులు, సన్నిహితులు కూడా మూడు మొక్కలు నాటాలని చాలెంజ్ విసరండి.

నాలుగు అంచెల కంచెల నడుమ..

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు.. పోలీసుల భారీ బందోబస్తు

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభ సమావేశాలు మంగళవారం ఉదయం 11 గంటల నుంచి ప్రారంభంకానున్నాయి. సభ ప్రారంభం అనంతరం కంటోన్మెంట్ శాసనసభ్యురాలు లాస్యనందిత మృతికి సభ సంతాపం తెలపనున్నది. సభ వాయిదా అనంతరం బీఏసీ సమావేశం జరుగనున్నది. ఈ నెల 25న రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. అదే రోజు ఉదయం 9గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో క్యాబినెట్ సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలుపనున్నది. శాసనమండలి సమావేశాలు ఈ నెల 24 బుధవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభంకానున్నాయి. అసెంబ్లీ సమావేశాల్లో రైతు భరోసా చర్చిస్తామని, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఆర్వోఆర్ కొత్త చట్టం తీసుకురానున్నారని సమాచారం. సమావేశాలకు పోలీసులు నాలుగు అంచెల కంచెల విధానాన్ని అమలు చేస్తున్నారు. పబ్లిక్ గార్డెన్ బస్‌స్టాండ్ దగ్గర భారీ ఎత్తుతో కంచెలను ఏర్పాటు చేశారు. అసెంబ్లీ లోపలికి వెళ్లే దగ్గర రెండు రకాల కంచెలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో కంచెలను తొలగించామని ప్రకటించిన ప్రభుత్వం... అందుకు విరుద్ధంగా గతంలో కంటే ఎక్కువగా కంచెలను ఏర్పాటు చేసిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. అసెంబ్లీ సమావేశాలు ఆగస్టు 2 లేదా 3వ తేదీతో ముగించే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. ఈనెల 25న బడ్జెట్ ప్రవేశపెట్టిన మరుసటి రోజున ఆనవాయితీ ప్రకారం 26న సెలవు ఇవ్వనున్నారు. ఆదివారం నగరంలో బోనాలు ఉండటంతో ఆ రోజు కూడా సెలవు ఇవ్వనున్నారని సమాచారం. ఈనెలాఖరుకల్లా బడ్జెట్‌ను ఉభయ సభలు ఆమోదించి గవర్నర్ ఆమోదానికి పంపించాల్సి ఉంటుంది. గతంలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ఈనెలాఖరుతో ముగియనున్నది. ఈ నేపథ్యంలో మొదట బడ్జెట్‌కు సభ ఆమోద తెలపాల్సి ఉంది.

రియల్' ధమాల్!

- క్యూ-2లో దేశవ్యాప్తంగా భూముల అమ్మకాలు కుదేలు
- హైదరాబాద్‌లో విక్రయం ఒక్కటే
- ఎన్నికల ప్రభావంతో తగ్గిన భూం
- 'అనరాక్' సంస్థ నివేదిక వెల్లడి



హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 22 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం తిరోగమన దిశలో సాగుతున్నది. గత మూడు నెలలుగా అన్ని ప్రధాన మెట్రో నగరాల్లో భూముల క్రయవిక్రయాలు గణనీయంగా తగ్గిపోయాయని, ఏప్రిల్-జూన్ త్రైమాసికం (క్యూ-2)లో మొత్తంగా 325 ఎకరాలకు సంబంధించిన 25 లావాదేవీలు మాత్రమే జరిగాయని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ 'అనరాక్' తన తాజా నివేదికలో వెల్లడించింది. ధరల పెరుగుదల, సార్వత్రిక ఎన్నికలే ఇందుకు ప్రధాన కారణమని పేర్కొన్నది. నిరుడు ఇదే సమయంలో దేశవ్యాప్తంగా 721 ఎకరాలకు సంబంధించిన 29 లావాదేవీలు జరిగినట్టు తెలిపింది. ప్రస్తుతం లావాదేవీల సంఖ్యలో బెంగళూరు అగ్రగామిగా నిలిచిందని, ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మధ్య ఆ నగరంలో 114 ఎకరాలకు సంబంధించిన 9 వేర్వేరు లావాదేవీలు జరిగాయని 'అనరాక్' గ్రూప్ రీజినల్ డైరెక్టర్, రిసెర్చ్ అండ్ అడ్వైజరీ హెడ్ ప్రశాంత్ థాకూర్ వెల్లడించారు. ఇదే సమయంలో గుర్గావ్‌లో 7 లావాదేవీల ద్వారా 77.5 ఎకరాలు, ముంబైలో 2 లావాదేవీల ద్వారా 4.52 ఎకరాలు, హైదరాబాద్‌లో 1 లావాదేవీ ద్వారా 48 ఎకరాలు, పుణెలో 2 లావాదేవీల ద్వారా 27.5 ఎకరాలు, చెన్నైలో 1 లావాదేవీ ద్వారా 27 ఎకరాలు, థానేలో 2 లావాదేవీల ద్వారా 24.95 ఎకరాలు, అహ్మదాబాద్‌లో 1 లావాదేవీ ద్వారా కేవలం 1.37 ఎకరాల విక్రయాలు జరిగినట్టు వివరించారు.

ఈ ఏడాది తొలి 6 నెలల్లో జరిగిన 'రియల్' డీల్స్

నగరం	లావదేవీలు	ఎకరాలు
బెంగళూరు	15	216
గుర్గావ్	14	162
ముంబై	5	34
హైదరాబాద్	3	63,5
చెన్నై	3	48
ఘజియాబాద్	1	62.5
ఢిల్లీ	1	5
దేశవ్యాప్తంగా	54	1,045

తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకురాలు తుల ఉమ. చిత్రంలో గాదె ఇన్నయ్య, తెలంగాణ విఠల్, పాశం యాదగిరి తదితరులు

అక్కడ ఏ1.. ఇక్కడ ఏ2 పాలన

- తెలంగాణ అస్థిత్వాన్ని ప్రశ్నార్థకం చేసేందుకు చంద్రబాబు కుట్ర
- 18 మందిని పొట్టనబెట్టుకున్న వ్యక్తికి జైకొట్టడం సిగ్గుచేటు
- 42వేల మంది చెరుకు రైతుల పొట్టగొట్టిన ఘనత ఆయనది
- రైతు రుణమాఫీకి డబ్బుల్లేవుగానీ లక్షన్నర కోట్లతో మూసీ ప్రక్షాళ నా?
- తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల వేదిక రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ఖైరతాబాద్, జూలై 22: ఏపీ సీఎం చంద్రబాబునాయుడు మరోసారి తెలంగాణ అస్థిత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చే కుట్రలు పన్నుతున్నారని, అందుకు విభజన చట్టాన్ని సాకుగా తీసుకుంటున్నారని, రాష్ట్రం సిద్ధించి దశాబ్దమైనా ఇంకా పోరాడాల్సిన దుస్థితి వచ్చిందని, మళ్లీ కొట్లాటకు తెలంగాణ ప్రజలు సిద్ధం కావాల్సిన తరుణమిదని తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు విమర్శలు గుప్పించారు. తెలంగాణ విఠల్ అధ్యక్షతన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ ప్రస్తుతం అక్కడ (ఆంధ్రప్రదేశ్)లో ఏ1.. ఇక్కడ (తెలంగాణ)లో ఏ2 పాలన సాగిస్తున్నారని, తెలంగాణ ఉద్యమాన్ని కూకటివేళ్లతో అణచివేయాలని ప్రయత్నించిన వ్యక్తికి ఇక్కడి పాలకుడు భజన చేయడం దురదృష్టకరమని విమర్శించారు. తెలంగాణ కోసం పోరాడిన బెల్లి లలిత, మారోజు వీరన్న తదితర 18 మందిని పొట్టనపెట్టుకున్న వ్యక్తికి జై కొట్టడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ సామాజికవర్గ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును మేధావి అని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశాడంటూ పొగడమేమిటని ప్రశ్నించారు. భువనగిరిలో 18 మంది ఎలా చనిపోయారో ఇక్కడి ప్రజలకు తెలుసున్నారు. రూ.169 కోట్లకు నిజాం షుగర్స్ భూములను అమ్మేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని, 42వేల మంది చెరుకు రైతుల పొట్టగొట్టారని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో దొంగల పాలన కొనసాగుతున్నదని, అధిష్ఠానంలో ఉన్న సోనియాగాంధీ, రాహుల్, అధినాయకత్వం ధృతరాష్ట్ర పాత్ర పోషిస్తున్నారని దుయ్యబట్టారు. 'ఉద్యమకారులకు ఏదైనా చేయాలని కోరితే ఏమైనా కేసులున్నాయా? అని అడుగుతున్నరు.. ఏం కేసులు కావాలి? ఏమైనా బ్రీఫ్‌కేసులు కావాల్నా?' అని పాశం ధ్వజమెత్తారు. నాడు చంద్రబాబు నాయుడు, వెంకయ్యనాయుడుతో కలిసి అర్ధరాత్రి పోలవరం ప్రాజెక్టు కోసం ఆర్డినెన్స్ తెచ్చుకున్నారని, ఏడు మండలాలను కోల్పోయి రెండు లక్షల మంది నిర్వాసితులయ్యారని, ఇప్పటికే పర్ణశాల, కల్యాణ కట్ట, నవగ్రహాల ఆలయం మునిగిపోయాయని, మరో పది అడుగులు కడితే రామదాసు ఆలయం, ఇంకో పది అడుగులు కడితే పూర్తిగా భద్రాచలం పట్టణం, గర్భాలయం కూడా మునిగిపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. రూ.లక్షన్నర కోట్లతో మూసీ ప్రక్షాళన ఎలా చేస్తావని సీఎం రేవంత్‌రెడ్డిని పాశం యాదగిరి ప్రశ్నించారు.

ఎవడబ్బసొత్తని భూమి ఇస్తరు?: గాదె ఇన్నయ్య

ఢిల్లీ తరహాలో హైదరాబాద్‌లో ఏపీ భవనం కట్టుకోవడానికి భూమి ఇచ్చేందుకు నిర్ణయించారని, ఎవడబ్బసొత్తని భూమి ఇస్తారని తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య ప్రశ్నించారు. విభజన చట్టంలోని 9, 10వ షెడ్యూల్‌లు చదువుకుంటే వాస్తవాలు తెలుస్తాయని సూచించారు. పునర్విభజన చట్టంలోని అంశాలను తేల్చేందుకు కొత్తగా కమిటీలు వేశారని, కమిటీల పేరుతో కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు చేస్తారని ఎద్దేవాచేశారు.

స్థానిక ఎన్నికల్లో ఉద్యమకారులనే గెలిపించుకోవాలి : అరుణ

తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడుకునేందుకు గ్రామీణ స్థాయి నుంచి మరోసారి ముందుకు రావాల్సిన అవసరం ఏర్పడిందని, పొంచి ఉన్న ముప్పు, జరుగుతున్న అన్యాయంపై తెలంగాణ ప్రజలకు వివరించాలని తెలంగాణ ఉద్యమకారిణి అరుణ చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉద్యమకారులనే గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు సుశీలారెడ్డి మాట్లాడుతూ పదేండ్ల తర్వాత మళ్లీ ఇలాంటి పరిస్థితులు చూడాల్సి వస్తుందని అనుకోలేదని, పదేండ్ల పాటు ఇటు కన్నెత్తి చూడని చంద్రబాబు మళ్లీ ఈ ప్రాంతంపై దృష్టిపెట్టారని, ఇటీవల హైదరాబాద్ నగరం పసుపుపచ్చగా మారడం వెనుక ఆ ప్రమాదాన్ని గుర్తించామని ఆందోళన వ్యక్తంచేశారు.

కృష్ణాజలాలపై నోరువిప్పని రేవంత్ : తెలంగాణ విఠల్

రౌండ్‌టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించిన తెలంగాణ విఠల్ మాట్లాడుతూ కృష్ణాజలాల్లో తెలంగాణ వాటాపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు 75 శాతం పూర్తయిందని, ప్రభుత్వం మరో రూ.35వేల కోట్లు కేటాయిస్తే ప్రాజెక్టు సంపూర్ణమై 18 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందుతుందని చెప్పారు. కానీ ఈ ప్రాజెక్టును పక్కన పెట్టి రూ.1.50 లక్షల కోట్ల మూసీ ప్రక్షాళన అంశాన్ని తెరపైకి తెచ్చారని, మూసీతో ఎన్ని ఎకరాలు పండిస్తారో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని విఠల్ ప్రశ్నించారు. సమావేశంలో సీనియర్ అడ్వకేట్ చంద్రశేఖర్, నిఖిల్, షహబాజ్, కొండస్వామి, దయాందన్, షాహిద్, గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణపై మళ్లీ వలసవాదుల కండ్లు : తుల ఉమ

తెలంగాణ వనరులను మనమే వాడుకోవాలన్న ఆకాంక్షతో సకలజనుల భాగస్వామ్యంతో ఉద్యమం చేసి స్వరాష్ట్రం సాధించుకున్నామని, అలాంటి తెలంగాణపై మరోసారి వలసవాదుల కండ్లు పడ్డాయని బీఆర్ఎస్ నాయకురాలు తుల ఉమ మండిపడ్డారు. చంద్రబాబు మళ్లీ ఇక్కడ పాగా వేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. సీఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం రోజు ఆయన ప్రసంగంలో తెలంగాణ మాట, తెలంగాణ నినాదమే వినపడలేదని ఇందుకు తాను చాలా బాధపడ్డానని చెప్పారు. తెలంగాణ వద్దని, తెలంగాణ ఎలా వస్తుందో చూస్తానని తుపాకీ అడ్డుపెట్టిన వ్యక్తి చేతిలో పాలన ఉంటే తెలంగాణ అస్తిత్వం ఎలా మనగలుతుందని ప్రశ్నించారు. తెలంగాణ వచ్చిన పదేండ్లలో కనబడని చంద్రబాబు మళ్లీ ఈ ప్రాంతంపై దృష్టి పెట్టారని, ఇటీవల ఆయన పర్యటనలో హైదరాబాద్‌లో ఎక్కడ చూసినా ఆయన బొమ్మలే కనిపించాయని చెప్పారు. ఆంధ్రా వ్యక్తులు ర్యాలీలు, గస్తీలు తిరుగుతూ మళ్లీ అడ్డా వేస్తామని నినదించడం దేనికి సంకేతమని? ప్రశ్నించారు. ఇందుకు చౌరవ ఇచ్చిన ఆ శిష్యుడికే ఆ విషయం తెలియాలని చెప్పారు.

స్వశక్తి మహిళలకు సర్కారు ధోకా?

మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వం మహిళా సంఘాలకు అప్పగించింది. ఒక్కో జతకు ₹50 చొప్పున చెల్లించడానికి ఒప్పందం చేసుకోగా, కుట్టుపనులకు అవసరమయ్యే ముడి సామగ్రికే ఆ మొత్తం సరిపోదని మహిళా సంఘాలు తెల్చిచెప్పాయి. మార్చి 12న సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన మహాలక్ష్మి మహిళా సమ్మేళనంలో కుట్టు కూలీ పెంచాలని కోరుతూ.. మహిళా సంఘాల సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఆ మేరకు స్పందించిన సీఎం రేవంత్ కేంద్రం నుంచి విడుదలయ్యే కుట్టుకూలీకి అదనంగా మరో ₹25 రాష్ట్ర ప్రభుత్వం కలిపి జతకు ₹75 చెల్లిస్తుందని వారికి హామీ ఇచ్చారు. ఆవెంటనే ఉత్తర్వులు జారీచేయాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని ఆదేశించారు. 2024-25 విద్యాసంవత్సరం నుంచే పెంచిన చార్జీలను వర్తింపచేస్తామని, వెంటేనే ఆ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని, జూన్7న జీవోనం 39ని సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు విడుదల చేశారు. ధరల పెంపుతో మహిళలంతా సంబురంగా పని పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 26,009 స్కూళ్లలోని 18,58,841 మంది విద్యార్థులకు ఒక్కో జత చొప్పున ప్రభుత్వం నిర్ధేశించిన గడువులోగా కుట్టి దుస్తులు అందించారు. వీరికి కుట్టు కూలీ కింద రూ.13,94,13,075 చెల్లించాల్సి ఉంది. అయితే, కుట్టు కూలీ కింద సమగ్రశిక్ష నుంచి విడుదలైన మొత్తంలో నుంచి జతకు ₹50 చొప్పున మాత్రమే డబ్బులు విడుదల చేసింది. ₹9,29,42,050 మాత్రమే చెల్లింపు చేస్తూ తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం చూస్తే.. రాష్ట్ర ప్రభుత్వం కూడా సమగ్ర శిక్ష నుంచి వచ్చిన ₹50కి మరో ₹25 జతచేసి ₹75 ఒకే సారి మొత్తాన్ని విడుదలచేయాల్సి ఉన్నది. కానీ, సమగ్ర శిక్ష నుంచి వచ్చిన నిధులను మాత్రమే విడుదల చేసి చేతులు దులుపుకున్నది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన ₹4,64,71,025 పెండింగ్‌లో పెట్టడంపై దుస్తులు కుట్టిన మహిళలంతా తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన వాటా ఇప్పట్లో చెల్లిస్తుందా..? లేదా..? అన్న దానిపై ఏ అధికారి వద్ద స్పష్టమైన సమాధానం లేదు.

మిత్తీలపై తప్పుడు లెక్క

మొదటిపేజీ తరువాయి...

పొందే ప్రయత్నం చేశారు. అయితే ముఖ్యమంత్రి చెప్పింది పచ్చి అబద్ధమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇందుకు కాగ్‌కు సమర్పించిన గణాంకాలనే సాక్ష్యంగా చూపుతున్నారు. డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మే నెల వరకు ఆరు నెలల్లో వడ్డీల కింద చెల్లించిన మొత్తం రూ.12,199 కోట్లు. అంటే సగటున నెలకు కట్టింది రూ.2,033 కోట్లు మాత్రమే. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో అయితే నెలకు రూ.1865 కోట్లు మాత్రమే చెల్లించారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే రూ.7వేల కోట్లు చెల్లిస్తున్నట్టు చెప్తున్నారని విమర్శిస్తున్నారు. ఒక్క రూపాయి కట్టి మూడున్నర రెట్లు కట్టినట్టు ప్రచారం చేస్తున్నారని మండిపడుతున్నారు.

అప్పులపైనా అదే ప్రచారం

గత ప్రభుత్వం చేసిన అప్పులపైనా సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే తప్పుడు ప్రచారం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం నిరుడు డిసెంబర్‌లో అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేత పత్రం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ అన్ని రకాల అప్పులు కలిపి రూ.6.71 లక్షల కోట్లు. ఇందులో ఎఫ్ఆర్బీఎం రుణాలు రూ.3.89 లక్షల కోట్లు మాత్రమే. మిగతావి ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లకు గ్యారెంటీగా ఉండి సమీకరించిన రుణాలు. వాస్తవానికి తెలంగాణ ఏర్పడేనాటికే వారసత్వంగా రూ.72,658 కోట్ల అప్పులు వచ్చాయి. అంటే బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో చేసిన అప్పులు రూ.6 లక్షల కోట్లు మాత్రమే. కానీ సీఎం రేవంత్‌రెడ్డి రూ.లక్ష కోట్లు అదనంగా చేర్చి చెప్తున్నారని విమర్శిస్తున్నారు.

ఆర్థిక వృద్ధి సంగతేమిటి?

కేసీఆర్ ప్రభుత్వం అప్పులు చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు, కాంగ్రెస్ నేతలు పదేపదే విమర్శిస్తున్నారే తప్ప.. గత పదేండ్లలో జరిగిన ఆర్థిక ప్రగతిని ఎందుకు గుర్తించడంలేదని ఆర్థికవేత్తలు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర బడ్జెట్, తలసరి ఆదాయం, జీఎస్డీపీ, పన్ను రాబడుల పరంగా తెలంగాణ గణనీయమైన వృద్ధిని సాధించించిందని చెప్తున్నారు. జనాభాపరంగా దేశంలో 12వ స్థానం, విస్తీర్ణం పరంగా 11వ స్థానంలో ఉన్న తెలంగాణ ఆర్థిక వృద్ధిలో, అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రస్థానానికి ఎదిగిందని చెప్తున్నారు. కానీ ఈ వాస్తవాలను ప్రభుత్వం కప్పిపుచ్చుతున్నదని మండిపడుతున్నారు.

- 2014-15లో రూ.1,00,638 కోట్లుగా ఉన్న రాష్ట్ర బడ్జెట్ 2023-24 నాటికి రూ.2,90,396 కోట్లకు చేరింది. అంటే.. దాదాపు మూడు రెట్లు పెరిగింది. రాష్ట్ర పద్దు ఏటా 12.69 శాతం వృద్ధి నమోదు చేసింది.
- రాష్ట్రంలో తలసరి ఆదాయం 2014-15లో రూ.1,24,104 ఉండగా, 2023-24 నాటికి రూ.3,17,117కు పెరిగింది. అంటే.. రెండున్నర రెట్ల పెరుగుదల నమోదైంది. 2014లో తలసరి ఆదాయంలో దేశంలో 10వ స్థానంలో ఉండగా, 2023 నాటికి అగ్రస్థానానికి చేరిందని నిపుణులు పేర్కొంటున్నారు.
- 2014లో రాష్ట్ర జీఎస్డీపీ రూ. 3.79 లక్షల కోట్లు ఉండగా.. 2023-24 నాటికి రెండున్నర రెట్లు పెరిగి రూ.13.28 లక్షల కోట్లకు చేరింది.
- 2014లో తలసరి ఆదాయం రూ. 93,151గా ఉంటే, 2023 నాటికి రూ. 3,12,398 చేరుకున్నది. అంటే 235 శాతం పెరిగింది.
- రాష్ట్ర రెవెన్యూ రాబడులు 2014-15లో రూ.51,042 కోట్లు మాత్రమే. ఇది 2023-24 నాటికి రూ.2,16,567 కోట్లకు చేరాయి. అంటే దాదాపు నాలుగున్న రెట్లు పెరిగాయి.
- రాష్ట్ర సొంత రాబడులను గణించినా.. 2015-16లో రూ.39,974 కోట్లుగా ఉండగా 2023-24 నాటికి రూ.1.31 లక్షల కోట్లకు చేరుకున్నది. తొమ్మిదేండ్లలో 227 శాతం పెరుగుదల కనిపించింది. సగటున లెక్కించినప్పుడు ఏటా రికార్డు స్థాయిలో 18.97 శాతం వృద్ధిరేటును నమోదు చేసింది.
- తెలంగాణ చిన్న రాష్ట్రమైనా.. దేశ జీడీపీ వృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నదని మాజీ సీఎం కేసీఆర్ పదేపదే చెప్పేవారు. దీనికి తగ్గట్టే దేశ జీడీపీలో తెలంగాణ వాటా ప్రతి సంవత్సరం పెరుగుతూనే వచ్చింది. దేశ జనాభాలో తెలంగాణ జనాభా 2.7 శాతం మాత్రమే అయినా.. 2014-15లో దేశ జీడీపీలో తెలంగాణ వాటా 4.1% కాగా, పదేండ్లలో 4.9 శాతానికి పెరిగింది.

రాష్ట్ర అప్పుల గురించి మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు.. తెలంగాణ సాధించిన ఈ ఆర్థిక విజయాలను ఎందుకు ప్రస్తావించడం లేదని ఆర్థిక వేత్తలు ప్రశ్నిస్తున్నారు.

రాష్ట్ర పరపతిపై దెబ్బ?

ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి పదేపదే బీద అరుపులు అరిస్తే రాష్ట్ర పరపతి దెబ్బతినే అవకాశం ఉన్నదని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాజకీయ లబ్ధి కోసం ప్రతి వేదికపై మాట్లాడటం వల్ల కార్పొరేట్ సంస్థలకు రాష్ట్రంపై ఉన్న అభిప్రాయం పోతుందని చెప్తున్నారు. దీనికితోడు నెలకు రూ.7వేల కోట్ల వడ్డీలు చెల్లిస్తున్నామని చెప్పడం ద్వారా అప్పును మూడు రెట్లు అధికంగా చూపుతున్నట్టేనని.. తద్వారా రాష్ట్రం దివాలా అంచున ఉన్నదనే భావన కలిగిస్తున్నారని అంటున్నారు. వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలనుకునేవారు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారని అంటున్నారు.ఇప్పటికైనా సీఎం తన వ్యవహార శైలిని మార్చుకోవాలని సూచిస్తున్నారు.